# కలలే బాగుంటాయ్

**రా**జారావ్‌కి విమానంలో ప్రయాణం చెయ్యడం యిష్టం. అమెరికా, ఇంగ్లండ్, ఇటలీ, ఫ్రాన్స్, జపాన్ ఇలాంటి దేశాలన్నిటికీ వారానికి ఒకసారి వెళ్ళి, ఆయా దేశాల్లోని ప్రధాననగరాల్లో అత్యాధునికమైన హోటళ్ళలో బస చేసి, ఖరీదైన తిండి తింటూ, చాలా ఖరీదైన మద్యపానాలు చేస్తూ, ఇంకా ఖరీదైన అమ్మాయిల్ని అనుభవిస్తూ రోజులు గడపడం అతనికి సరదా.

స్వదేశంలో వున్నా విదేశీ కార్లలో తిరుగుతూ, విదేశీ విస్కీ తాగుతూ దేశానికి తనే రాజన్నంత దర్జాగా బ్రతకటం రాజారావ్‌కి అలవాటు.

రాజారావ్ వుండే మేడ ఎంతలేదన్నా యాభై లక్షల రూపాయల విలువ చేస్తుంది. ఆ మేడకి బంగారపు గోడలుంటాయి. నేల మీద రూపాయి నోట్ల తివాచీలు పరిచి వుంటాయి. అతను రూపాయి నోట్ల మీద నడుస్తాడు. పువ్వుల మీద పడుకుంటాడు. నవరత్నాలూ అన్నంగా వండించి బంగారం పళ్ళెంలో పెట్టుకొని భోంచేస్తాడు. అమృతం మంచి నీళ్ళుగా తాగుతాడు.

అతని భార్య అప్సరసలకన్నా అందంగా వుంటుంది. దేశంలోని ప్రతి నగరంలోనూ అతనికి భవనాలున్నాయి. ఆ భవనాలన్నిటిలో అతని భార్య కన్నా అందమైన ఉంపుడు కత్తెలున్నారు. దేశంలోని అన్ని బాంకుల్లోనూ, విదేశాల్లోని కొన్ని బాంకుల్లోనూ అతనికి ఎకౌంట్లున్నాయి.

దేశంలో రాజారావ్ పేరు విననివారు ఎవరూ వుండరు. అతని కున్నంత పలుకుబడి, కీర్తిగౌరవాలూ దేశంలో ఇంకెవరికీ లేవు. పంచాయతీ ప్రెసిడెంట్ నుంచి ప్రధానమంత్రి దాకా అందరికీ అతనితో అవసరముంటుంది. అందరూ అతని పరిచయం కోసం, స్నేహం కోసం ప్రాకులాడతారు.

రాజారావ్ మహాకవి. గొప్ప గాయకుడు. మంచి చిత్రకారుడు. సాటి లేని మేటి నటుడు.

రాజారావ్ ప్రపంచ ప్రసిద్ధి పొందిన పారిశ్రామికవేత్త ప్రముఖ రాజకీయవేత్త, మహామేధావి. అయిదురోజుల పాటు అనర్గళంగా ఉపన్యసించగల మహావక్త.

రాజారావ్ అసాధారణమైన అందగాడు. అతని అందానికి ఆడవాళ్ళంతా మూర్ఛపోతారు. మగవాళ్ళంతా అసూయతో కుళ్ళుతారు.

అతను అతి మంచివాడు. అత్యంతధైర్యసాహసాలు కలవాడు. అజాతశత్రువు, అరివీరభయంకరుడు. అతనింకా...

* * *

రాజారావ్ రోడ్డు మీద ఒక పక్కగా చకచకా నడుస్తున్నాడు. అతని మనసంతా చిరాగ్గా వుంది. అతను వేసుకున్న చొక్కా మాసిపోయి వుంది. కాలర్ చిరిగిపోయి వుంది. అతను తొడుక్కున్న పాంటు లూజుగా, అతనిది కానట్టుగా, అసహ్యంగా వుంది. అతని చెప్పులు మడమలు అరిగిపోయి పట్టీలు తెగిపోయీ వున్నాయి.

ఎండ చుర్రుమంటోంది. తెల్లదో నల్లదో తెలీకుండా వున్న జేబు గుడ్డతో మొహం మీద చెమట మాటిమాటికీ తుడుచుకుంటూ, పరుగెత్తుతున్నట్టుగా నడుస్తున్నాడు రాజారావ్. అలవాటు ప్రకారం టైం చూసుకోబోయాడు. చేతికి వాచీ లేదు. అప్పు తీర్చడం కోసం అంతకుముందు రోజే అతి చవగ్గా అమ్మేసిన సంగతి గుర్తొచ్చింది. అంత చవగ్గా అమ్మెయ్యాల్సి వచ్చినందుకు ఏడుపొచ్చింది.

ఆఫీసుకు చేరుకునేసరికి అయిదు నిమిషాలు తక్కువ పదకొండయింది.

ఆలస్యంగా వచ్చినందుకు ఆఫీసరు పిలిచి అడ్డమైన చీవాట్లూ వేశాడు.

ఇంట్లో వంట ఆలస్యమైందనీ, చంటాడికి వొంట్లో బావుండలేదనీ, బస్సు దొరకలేదనీ, రిక్షాకి సరిపడా డబ్బుల్లేవనీ చెబుదామనుకున్నాడు రాజారావ్, కాని చెప్పలేక పోయాడు. అలవాటు ప్రకారం ఆఫీసర్ తిట్టిన తిట్లన్నీ తిని 'ఛీ! వెధవ బ్రతుకు!' అని, తనను తాను తిట్టుకుంటూ వచ్చి, తన సీట్లో కూలబడ్డాడు.

ఆ కూర్చోవటం కూర్చోవటం సాయంత్రం ఆరింటిదాకా కుర్చీలోంచి లేవలేదు. మధ్యలో లేచి వెళ్ళి కాఫీ తాగుదామనుకుని, డబ్బుల్లేవన్న సంగతి గుర్తొచ్చి ఆ ప్రయత్నం మానుకున్నాడు. తన దగ్గర మిగిలిందొకటీ పక్కన కూర్చునే గుమాస్తా నడిగి మరోటీ, సిగరెట్లు మాత్రం కాల్చుకున్నాడు.

ఆరింటిదాకా కూర్చున్నా కావలసిన పని పూర్తి కాలేదు. పూర్తి కానందుకు హెడ్ గుమాస్తా చేత, ఆ పైన ఆఫీసర్ చేతా కూడా చీవాట్లు తిన్నాడు రాజారావ్. వాళ్ళిద్దరి చేతా వార్నింగ్‌లు పుచ్చుకుని, అర్జెంటు ఫైళ్ళు రెండు చేత బుచ్చుకుని, మెల్లగా ఆఫీసులోంచి బయట పడ్డాడు.

జేబులో చూసుకుంటే ముప్ఫయ్యారు పైసలున్నాయి. కాఫీ పొడి కొనాలి. కూరలు కొనాలి. పెద్దాడికి పుస్తకాలు కొనాలి. టూత్ పేస్టు కొనాలి. బట్టల సబ్బు కొనాలి. ఏం కొన్నా కొనకపోయినా చంటాడికి మందులూ, పాలడబ్బా అర్జెంటుగా కొనాలి.

అప్పివ్వమని, తనతో పాటు పనిచేసేవాళ్ళని అయిదుగుర్ని అడిగాడు రాజారావ్. వాళ్ళ చేతులూ కాళ్ళూ పుచ్చుకుని బతిమాలి బామాలితే, వాళ్ళలో ఇద్దరు కలిసి మూడు రూపాయలిచ్చారు.

మందులు కొనగా, అందులో ఇంక అయిదు పైసలు మిగిలాయి. ఆ అయిదు పైసలూ, అంతకుముందు తన దగ్గరున్న ముప్ఫయ్యారు పైసల్లో, ఆరు పైసలూ ఇచ్చి రెండు సిగరెట్లు కొనుక్కున్నాడు.

బస్సు కోసం ఎంతసేపు నిలబడ్డా రాలేదు. వచ్చిన తర్వాత ఖాళీ దొరకలేదు. మరికొంతసేపు నిలబడ్డాడు. మరో రెండు బస్సులు తప్పిపోయాయి. ఇంక నిలబడే ఓపిక లేక, మెల్లగా కాళ్ళీడ్చుకుంటూ ఇంటిదారి పట్టాడు రాజారామ్.

ఇంటికి చేరుకునేసరికి పావు తక్కువ ఎనిమిదైంది. ఇల్లంతా చీకటిగా వుంది. టేబిల్ మీద వున్న అలారం గడియారంలో రేడియం ముళ్ళూ, అంకెలూ ఆ చీకట్లో మసక మసగ్గా మెరుస్తున్నాయి.

ఆ గడియారం రాజారావ్ పెళ్ళికి ఒక స్నేహితుడు బహుమతిగా ఇచ్చాడు. చీకట్లో ఆ గడియారం ముళ్ళూ అంకెలూ ఇదివరకింకా బాగా మెరిసేవి.

రాజారావ్ భార్య ఒక మూల బుడ్డిదీపం ముందు కూర్చుని పెద్దాడికి పాఠం చెబుతోంది. ‘‘కరెంట్ పోయిందా?’’ అని అడిగాడు రాజారావ్ ‘‘ఊ’’ అంది అతని భార్య.

కరెంట్ పోయిందో, బిలు కట్టాల్సిన తుదిగడువు కూడా దాటిపోయినందుకు కట్ చేశారో అర్థం కాలేదు రాజారావ్‌కి.

పిల్లలు మధ్య వాళ్ళిద్దరూ చాపమీద పడుకుని, దిండు కోసం దెబ్బలాడుకుంటున్నారు. చంటాడు కుక్కి మంచం మీద పడుకుని నిద్రపోతున్నాడు. రాజారావ్ మంచం దగ్గరకెళ్ళి, కొడుకు పొట్టమీద చెయ్యి వేసి చూశాడు. జ్వరం ఇంకా తగ్గినట్టుగా లేదు.

జేబులో వున్న మందులు తీసి భార్య చేతికిచ్చాడు రాజారావ్. ''కాఫీ పొడి ఏదీ, కూరలేవీ, టూత్ పేస్ట్ ఏదీ, పుస్తకాలేవీ?'' అని అడిగింది అతని భార్య.

"అప్పు దొరకలేదు" అన్నాడు రాజారావ్ మెల్లగా.

"కనీసం పాలడబ్బా అయినా తెచ్చారా?" అంది. అతని భార్య – అడగాలా వద్దా అని భయపడుతున్నట్టుగా.

"అప్పు దొరకలేదంటే..." అని విసుక్కున్నాడు రాజారావ్.

పాఠం సరిగా చదవటం లేదని తిట్టి, కొడుకు నెత్తి మీద గట్టిగా మొట్టింది రాజారావ్ భార్య. బిగ్గరగా ఏడవటానికి భయమేసి, మెల్లగా ఏడుస్తూ, ఏడుపు దిగమింగటానికి ప్రయత్నిస్తున్నాడా కుర్రాడు.

బట్టలు మార్చుకుని, కాళ్ళూ చేతులూ కడుక్కుని భోజనానికి కూర్చున్నాడు రాజారావ్. కూర లేదని పచ్చడి వేసి పెట్టింది అతని భార్య. ఆ పచ్చడితోనూ, చారుతోనూ నాలుగు మెతుకులు తిని లేచాడు. మజ్జిగ లేదు.

అద్దె డబ్బు కోసం ఇంటివాడు, పాలడబ్బు కోసం పాలవాడూ వచ్చి వెళ్ళారని చెప్పింది రాజారావ్ భార్య అతను అన్నం తింటుండగా. రేపయినా పాలడబ్బా, కాఫీ పొడి తెచ్చి తీరాలలంది. అన్నిటికీ వూ కొట్టి వూరుకున్నాడు రాజారావ్.

భోజనం ముగించి వచ్చి, జేబులో వున్న రెండు సిగరెట్లలోనూ ఒకటి తీసి వెలిగించుకుని మరొకటి మర్నాటి వుదయానికి దాచుకుని, పడక్కుర్చీలో కూలబడ్డాడు. పేపర్ చదువుకుందామంటే దీపం వెల్తురు చాల్లేదు.

పోయిన కరెంట్ మళ్ళీ రానేలేదు.

కొంతసేపు అలాగే కుర్చీలో కూర్చుని, ఆ తర్వాత మంచమ్మీదికెళ్ళి పడుకున్నాడు.

పిల్లలంతా నిద్రపోయారు. రాజారావ్ భార్య కూడా భోజనం ముగించి వంటింట్లో ఎక్కడివక్కడ సర్దేసి వచ్చి కుక్కి మంచమ్మీద చంటాడి పక్కనే పడుకుంది.

రాజారావ్ మెల్లగా లేచి, పక్కనే వున్న మంచమ్మీదికి వంగి, చంటాడి ఒంటి మీద చెయ్యేసి చూశాడు. జ్వరం ఇందాకటి కంటే ఇప్పుడు కాస్త తగ్గినటుగా వుంది. ఆ తర్వాత భార్య భుజం పుచ్చుకుని మెల్లగా గుంజాడు.

అతని చెయ్యి విదిలించి కొట్టి "నాకు ఒంట్లో బాగాలేదు" అని పక్కకి తిరిగి, ముసుగు బిగించి పడుకుంది రాజారావ్ భార్య.

రాజారావ్‌కి చాలాసేపటి వరకూ నిద్ర పట్టలేదు. నిద్రపట్టాక వచ్చిన కలలో –

రాజారావ్ విమానంలో పారిస్ వెళ్తున్నాడు. అప్సరసల్లాంటి అమ్మాయిల్తో కలిసి డాన్స్ చేస్తున్నాడు. అతను కోటీశ్వరుడు, పెద్ద భవనం. అందులో బంగారపు గోడలు.. ఇంకా.

★ ★ ★

రాత్రి పూటే కాదు, అప్పుడప్పుడు పగటి కలలు కూడా కంటూ వుంటాడు రాజారావ్.

O

*(జ్యోతి: దీపావళి ప్రత్యేక సంచిక – 1972)*